# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

2. **అమెరికా ఎగుమతి సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

3. **తెలంగాణలోని భద్రాచలంలో ఈరోజు నిర్వహించే శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొంటారు.**

4. **'అడవితల్లి బాట' పేరుతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసిన రహదారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈ రోజు ప్రారంభిస్తారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉద్యోగ మేళామేళాలు నిర్వహిస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ అన్నారు.**

==========================

దేశంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానించడానికి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమిళనాడులో 8 వేల 300 కోట్ల రూపాయల రైలు, రోడ్డు ప్రాజెక్టులకు నిన్న ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే, రామేశ్వరంలో పంబన్ వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం రామేశ్వరంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జిని 20వ శతాబ్దపు అద్భుతమని తెలిపారు . గడచిన దశాబ్ద కాలంలో దేశంలోని మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తూ ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించామని తెలుపుతూ,

వాయిస్ ..27 సెకన్లు

----------------------------

అమెరికా ఎగుమతి సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా ఆ దేశ ప్రభుత్వంతో చర్చలు జరపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అమెరికా సుంకాలతో నష్టపోతున్న ఆక్వారంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ స్థూల దేశీయోత్పత్తి -జీడీపీలో మత్స్యరంగం

కీలకంగా ఉందని అన్నారు. భారత్‌పై అమెరికా 27శాతం సుంకం విధింపు వల్ల ఆక్వారంగానికి నష్టమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శీతల గిడ్డంగుల్లోనూ నిల్వ కోసం స్థలం లేదని, ఆక్వా రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని లేఖలో ముఖ్యమంత్రి కోరారు.

---------------------------

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ఈరోజు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారని అధికారులు తెలిపారు. కాగా మరోవైపు నిన్న శ్రీరామనవమి సందర్భంగా మిధిలా స్టేడియంలో సీతారాముల కళ్యాణం వైభవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఇది ఇలా వుండగా శ్రీరామ నవమిని పురస్కరించుకొని హైదరాబాద్‌లో శ్రీరాముడి శోభాయాత్రను నిర్వహించారు. దూల్‌పేటలో ప్రారంభమైన శోభాయాత్ర కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---------------------------

'అడవితల్లి బాట' పేరుతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసిన రహదారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈ రోజు ప్రారంభిస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ రోజు, రేపు పర్యటించి పలు రహదారులను ప్రారంభించనున్నారు. పర్యటనలో భాగంగా ఈ ఉదయం విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం పెదపాడుకు వెళ్తారు. అక్కడి గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి బహిరంగసభలో పాల్గొంటారు. రేపు ఉదయం అరకు మండలంలోని సుంకరమిట్ట చేరుకుని పైవంతెనను ప్రారంభిస్తారు. అనంతరం విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్‌కు చేరుకుని పర్యావరణ హిత పర్యాటకంపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

శ్రీకాకుళం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్థానిక ప్రజా ప్రతినిధి గొండు శంకర్‌తో కలసి ఆయన నిన్న స్థానిక పొట్టి శ్రీరాములు మార్కెట్ ను పరిశీలించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, నాగావళి నది పరివాహక ప్రాంతంలో పార్కులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. త్వరలోనే ఏకీకృత కలెక్టర్ భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. మార్కెట్ పునః నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

కృష్ణా, గోదావరి జలాలపై విచారణకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ సమావేశానికి హాజరుకానున్నానని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో మంత్రి నిన్న సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న విచారణ అంశాలపై ఆరా తీశారు. వాదనలు వినిపిస్తున్న న్యాయ బృందానికి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు నిన్న వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన నిన్న రాత్రి జగదభిరాముడు ప్రత్యేక అలంకారంలో శేష వాహనంపై దర్శనమిచ్చారు. సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి.. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరోవైపు శ్రీరామనవమి ఆస్థానాన్ని పురస్కరించుకుని తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానాన్నినిర్వహించారు.ఇందులో భాగంగా శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం హనుమంత వాహనంపై శ్రీరాముడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి 9 నుంచి 10 గంటల వరకు ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ అన్నారు. శ్రీసత్య సాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన నిన్న భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ధర్మవరం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని అన్నారు. చేనేతలు అధికంగా ఉన్న ధర్మవరంలో ఉపాధి కల్పించేందుకు మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ తీసుకొస్తున్నామని చెప్పారు తద్వారా చేనేతలకు మేలు జరుగుతుందని తెలిపారు.

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఈ రోజు, రేపు ఉత్తరాఖండ్ లోని దేహ్రాడూన్‌లో పర్యటించనున్నారు. కేంద్ర సామాజిక, సాధికారత శాఖ మంత్రి వీరేంద్రకుమార్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే 'చింతన్ శివిర్' సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు హాజరవుతారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్–ఐపీఎల్‌లో భాగంగా ముంబై వేదికగా ఈరోజు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. కాగా నిన్న హైదరాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్ – హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గుజరాత్ విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణిత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఆ తర్వాత 153 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు 16.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసి విజయం సాధించింది.

=====================